నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 26 డిసెంబర్ 2023 | SURYAPET



# శ్రీరాముడిగా.. వేంకటేశ్వరుడిగా..

శ్రీరాముడి అలంకారంలో తిరువీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

## అలంకార సేవలో దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహ స్వామి

యాదగిరిగుట్టలో వైభవంగా అధ్యయనోత్సవాలు

వరుస సెలవులతో గుట్టకు పోటెత్తిన భక్తజనం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 25 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో అధ్యయనోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. మూడోరోజు సోమవారం స్వామివారికి నిత్యారాధనల అనంతరం ఆలయ మొదటి ప్రాకార మండపంలో తిరుప్పావై గోష్టి నిర్వహించారు. అనంతరం నవ కలశ పూజలు, నమ్మాళ్వారుకు అభిషేకం జరిపారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా లక్ష్మీనరసింహ స్వామి ఉదయం శ్రీరాముడు.. సాయంత్రం వేంకటేశ్వరుడి అలంకారంలో దర్శనమిచ్చారు. వరుస సెలవుల నేపథ్యంలో గుట్టకు భక్తులు భారీగా తరలివచ్చారు. దాంతో మాఢ వీధులు, క్యూ కాంప్లెక్స్ కిటకిటలాడాయి.



వేంకటేశ్వర స్వామి అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి



సూర్యాపేటలోని సిల్వి సిలోయం చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేసి పాస్టర్‌కు తినిపిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# శాంతి, సహనాలకు ప్రతీక క్రిస్మస్

మహోన్నత క్షమాగుణ సంపన్నుడు ఏసుక్రీస్తు

- తెలంగాణ అభివృద్ధి, ప్రశాంతత, ఐక్యతను పెంచిన ఘనత కేసీఆర్‌దే
- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- పలు చర్చిల్లో ప్రార్థనల్లో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు

సూర్యాపేటటౌన్, డిసెంబర్ 25 : శాంతి, సహనాలకు క్రిస్మస్ ప్రతీక అని, ఏసుక్రీస్తు మహోన్నత క్షమాగుణ సంపన్నుడని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు చర్చిల్లో ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ సమస్త మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల జాలి, అవధులు లేని త్యాగం, సడలని ఓర్పు, శత్రువుల పట్ల కూడా క్షమాగుణం కలిగి ఉన్న కరుణామయుడు ఏసుక్రీస్తు అన్నారు. ఆయన బోధనలు అనుసరణీయమని తెలిపారు. సర్వ మతాల సమ్మేళనానికి తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో శాంతి సామరస్యాలతో ఐక్యతను పెంపొందించారన్నారు. అన్ని వర్గాల ప్రజలు తనను మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించారని, అందరి నమ్మకాన్ని నిలబెడుతూ సూర్యాపేటను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ఈ వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాల సైదులు, ఆయా చర్చిల పాస్టర్లు సిల్వి, డాక్టర్ ప్రభుదాస్, సాల్మన్‌రాజు, నాయకులు అనుములపురి రవిబాబు, ఉప్పల ఆనంద్, పూర్ణ శశికాంత్, మద్ది శ్రీనివాస్‌యాదవ్, రమా కిరణ్, గుండపనేని కిరణ్ పాల్గొన్నారు.



నల్లగొండలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ అపూర్వరావు

# ఘనంగా క్రిస్మస్

## చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు.. కేక్ కటింగ్‌లు

ఆకట్టుకున్న ఏసుక్రీస్తు జనన ఘట్టాలు.. అలరించిన గీతాలాపనలు

క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు



రామగిరి, డిసెంబర్ 25 : క్రిస్మస్ వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. శాంతి, ప్రేమ, కరుణకు ప్రతిరూపమైన ఏసుక్రీస్తును కొలుస్తూ క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అర్ధరాత్రి నుంచే కేక్ కటింగ్‌లు చేసి, కొవ్వొత్తులు వెలిగించారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పాస్టర్ల బోధనలు, భక్తి గీతాలతో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. పలు చర్చిల వద్ద ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు జనన వృత్తాన్ని తెలియజేసే ఘట్టాలు ఆకట్టుకున్నాయి. శాంటాక్లాజ్ వేషధారణలో చిన్నారులు అలరించారు. నల్లగొండలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పలుచోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

# అధికారుల అండదండలతోనే రేషన్ బియ్యం రీ సైక్లింగ్

- రీ సైక్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, డిసెంబర్ 25 : అధికారుల అండదండలతోనే రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేస్తున్నారని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని రేషన్ దుకాణాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం చాలా వ్యయంతో బియ్యాన్ని కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేస్తున్నదన్నారు. రేషన్ బియ్యం రీ సైక్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ కార్డులపై ప్రజలకు నాణ్యమైన బియ్యం అందజేస్తామన్నారు. రాష్ట్రంలో 89 లక్షల కుటుంబాలకు 6కిలోల చొప్పున బియ్యం సరఫరా చేస్తున్నామని, రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని మంత్రి చెప్పారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రూ.56 వేల కోట్ల అప్పుల్లో, 11వేల కోట్ల రూపాయల నష్టాల్లో ఉన్నదని తెలిపారు. మిల్లర్ల దగ్గర రూ.22వేల కోట్ల విలువైన ధాన్యాన్ని కార్పొరేషన్ నిల్వ ఉంచిందన్నారు. రాష్ట్రంలోని ధాన్యాన్ని మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు అమ్మేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మిల్లర్లు ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రేషన్ బియ్యం పంపిణీని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు.

## హాకీ జాతీయ పోటీలకు నల్లగొండ క్రీడాకారులు



హాకీ జాతీయ పోటీలకు ఎంపికైన నల్లగొండ క్రీడాకారులు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 25 : మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్‌లో ఈ నెల 28 నుంచి జనవరి 4వరకు నిర్వహించే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 హాకీ పోటీలకు నల్లగొండ పట్టణానికి చెందిన సింగం మధు, రావుల గణేశ్, ఎండీ ఫైజాన్ ఎంపికైనట్లు నల్లగొండ హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఇమామ్ కరీం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సోమవారం ఆయన అభినందించారు. క్రీడాకారుల ఎంపిక పట్ల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వాసుదేవ రావు, డీఎస్‌డీఓ మగ్బూల్ అహ్మద్, హాకీ కోచ్ యావర్ హర్షం వ్యక్తం చేశారు.

# శోకసంద్రంలో మల్లెవానికుంట

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం

- బైక్ ప్రమాదంలో ఓ వ్యక్తి, యువకుడు మృతి
- మృతుడిని చూసేందుకు ఆటోలో వెళ్తూ ప్రమాదానికి గురై మరో నలుగురు..
- మృతుల్లో ఐదుగురు ఒకే కుటుంబానికి చెందినవారు..



మల్లెవానికుంట తండాలో మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

పెద్దవూర/ నిడమనూరు, డిసెంబర్ 25 : దట్టమైన పొగ మంచు కారణంగా జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన వారు ఐదుగురు ఉన్నారు. దీంతో పెద్దవూర మండలంలోని నిమ్మనాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లెవానికుంట, పూల్యా తండాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

### జంట ప్రమాదాలు.. గంటల వ్యవధిలోనే తిరిగిరాని లోకాలకు

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం మల్లెవాని కుంట తండాకు చెందిన రమావత్ శివకేశవులు (20) ఇంటర్ చదివి ఫ్లవర్ డెకరేషన్ నేర్చుకొని కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం స్వగ్రామంలో దత్తాత్రేయ స్వామి పండుగ ఉండడంతో ఆదివారం సాయంత్రం పని ముగించుకొని బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. రాత్రి సుమారు 11గంటల సమయంలో నిడమనూరు మండలం వేంపాడు స్టేజీ వద్ద దుకాణం నిర్వహిస్తున్న వేంపాడు గ్రామస్తుడు బల్గూరి సైదులు (60)ను పొగమంచు కారణంగా కనపడక ఢీకొట్టాడు. దీంతో సైదులు అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ 50 మీటర్ల దూరం వెళ్లి రోడ్డు వెంట ఉన్న దుకాణాన్ని ఢీకొని పడిపోయింది. దీంతో శివ తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు 108 వాహనంలో మిర్యాలగూడ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. హైదరాబాద్‌లో ఉన్న శివకేశవులు కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలియడంతో తన బంధువు రమావత్ పాండు టాటా ఏస్ వాహనాన్ని తీసుకొని హుటాహుటిన బయల్దేరారు. మల్లెవానికుంటలో కొంత మంది కుటుంబ సభ్యులను దించి అదే ఆటోలో ఉమ్మడి కుటుంబానికి చెందిన ఏడుగురు మిర్యాలగూడ దవాఖానకు బయల్దేరారు. మార్గమధ్యలో నిడమనూరు మండలంలోని వేంపాడు గ్రామ శివారులోని సాయిబాబ విగ్రహం దగ్గరకు రాగానే.. ఎదురుగా వేగంగా వచ్చిన పెట్రోల్ ట్యాంకర్ పొగ మంచుతో అదుపు తప్పి టాటా ఏస్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకేశవులు పెద్దనాన్న రమావత్ ఘన్యా (40), మేనత్త మూడావత్ బుజ్జి (38), బావ దూపావత్ నాగరాజు (28), పూల్యాతండాకు చెందిన దగ్గరి బంధువు ఆటో డ్రైవర్ రమావత్ పాండు (40) అక్కడికక్కడే మృతి చెందారు. శివకేశవులు తండ్రి రమావత్ ప్రభాకర్, పెదనాన్న కొడుకు రమావత్ వినోద్, మేన మామ మూడావత్ పాలేకర్ తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం పోలీసులు మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు. ఉమ్మడి కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందడంతో మల్లెవానికుంట, పూల్యాతండాలు శోక సంద్రంలో మునిగిపోయాయి. కాగా, ఆటో డ్రైవర్ పాండుకు ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతులందరూ హైదరాబాద్‌లో రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టాటా ఏస్ వాహనం

### పోలీసుల అప్రమత్తం

టాటా ఏస్ వాహనాన్ని పెట్రోల్ ట్యాంకర్ ఢీకొనడంతో కోదాడ – జడ్చర్ల హైవేపై తెల్లవారుజామున ట్రాఫిక్ స్తంభించింది. దట్టమైన పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే పరిస్థితి లేకపోవడంతో అప్రమత్తమైన ఎస్‌ఐ జె.గోపాల్‌రావు జేసీబీ సాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డు పక్కకు తీయించారు. ప్రమాదాలు జరుగకుండా పోలీసు సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

### మాజీ మంత్రి జానారెడ్డి పరామర్శ

మల్లెవానికుంట తండాలో మృతుల కుటుంబాలను మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రాంచందర్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.



పూల్యాతండాలో విలపిస్తున్న పాండునాయక్ కుమార్తెలు, కొడుకు

### సైదులుది నిరుపేద కుటుంబం

బైక్ ప్రమాదంలో దుర్మరణం చెందిన బల్గూరి సైదులు (60)ది నిరు పేద కుటుంబం. భార్య మృతి చెందడంతో తన ముగ్గురు పిల్లలను అన్నీ తానై పెంచాడు. వేంపాడు స్టేజీ వద్ద చిరు దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి సుమారు 11గంటల సమయంలో నిద్ర లేచిన ఆయన మూత్ర విసర్జన చేసి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సైదులు మరణ వార్త తెలిసి వేంపాడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే సైదులు మృతి చెందడంతో గ్రామస్తులు కంటతడి పెట్టారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

# ప్రజా పాలనను పకడ్బందీగా నిర్వహించాలి



జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సూర్యాపేట కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

- డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు గ్రామ, పట్టణ సభలు
- ప్రభుత్వ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- సూర్యాపేట కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, డిసెంబర్ 25 : రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డితో కలిసి ప్రజా పాలన కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మిగిలిన ఐదు గ్యారెంటీల అర్హులను గుర్తించేందుకు ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రతి కుటుంబానికీ దరఖాస్తు ఫామ్‌లు ముందస్తుగా ఉచితంగా అందిస్తామని, డిసెంబర్ 28 నుంచి జనవరి 6వరకు నిర్వహించే గ్రామ, పట్టణ సభల్లో ఈ ఫామ్‌లు తీసుకుంటామని తెలిపారు. అందుకోసం గ్రామ పంచాయతీలు, పట్టణ వార్డుల్లో అధికారులు గ్రామ సభలు ఏర్పాటు చేయాలన్నారు. దరఖాస్తులు తీసుకునేందుకు చిన్న గ్రామ పంచాయతీల్లో 4 కౌంటర్లు, మధ్యస్థ గ్రామాల్లో 8 కౌంటర్లు, పెద్ద గ్రామాల్లో 12 కౌంటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. గ్రామ సభల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని, అవసరమైన చోట హెల్త్ క్యాంపులు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సభలు నిర్వహించాలని, తాసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, ఎంఈఓ, డిప్యూటీ తాసీల్దార్ టీములుగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ప్రజా పాలనపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ సురేశ్, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, ఆర్డీఓలు జగదీశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ, డీడబ్ల్యూఓ జ్యోతిపద్మ, డీఎల్‌పీఓ సాంబిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

### గ్రామ సభల కోసం పటిష్ట బందోబస్తు : ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ : ప్రజా పాలనలో భాగంగా నిర్వహించే గ్రామ, పట్టణ సభలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన సోమవారం పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిందని, మహిళలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వరకు జరిగే సభల్లో భద్రతా లోపాలు లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్లూ కోల్ట్స్, పెట్రోకార్, పెట్రోలింగ్ పెంచాలన్నారు. ఈ సమావేశంలో కోదాడ డీఎస్పీ ప్రకాశ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్, మహేశ్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



గ్రామాల్లో తిరిగే ప్రచార వాహనాలు

## అర్హులందరికీ బీమా.. బ్యాంక్ అకౌంట్

- ఊరూరా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర
- ప్రత్యేక వాహనాలతో పల్లెపల్లెనా ప్రచారం..
- వివిధ స్కీమ్‌లు అందించడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు
- రేపటితో ముగియనున్న ప్రచారం

సూర్యాపేట, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ప్రజలకు సాగు, తాగునీటితోపాటు రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనతో భారతదేశం నేడు అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో ఉంది. అయితే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించే లక్ష్యంతో ప్రతి సంక్షేమ పథకం అర్హులకు అందాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా 18 నుంచి 50 ఏండ్లు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ బ్యాంక్ అక్కౌంట్ కలిగి ఉండడం, అలాగే రూ.20తో 2 లక్షల ప్రమాద బీమా, రూ.436తో సాధారణ మరణం సంభవించినా బీమా కల్పించే స్కీమ్‌లో చేర్పించడం, అర్హులైన వారందరికీ ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఇప్పించాలని లక్ష్యంగా పనిచేస్తున్నది. అలాగే

6వ పేజీలో